## క్లుప్తంగా

### వైద్య చికిత్సకు ఆర్థికసాయం


రూ.50 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న కేతిరెడ్డి సుప్రియ

**ముదిగుబ్బ:** మండల పరిధిలోని టీఎస్‌పాళ్యం గ్రామానికి చెందిన చిల్లా నాగముని ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఆసుపత్రి చికిత్సల కోసం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆమె ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో పాల్యం క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ముదిగుబ్బ వైద్యాధికారిగా శ్వేత



**ముదిగుబ్బ:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ వైద్యాధికారిగా శ్వేత శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇది వరకు పని చేస్తున్న లక్ష్మీనారాయణ బదిలీపై తిరుపతి వెళ్లారు. కదిరి ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న శ్వేత బదిలీపై ఇక్కడికి వచ్చారు. రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు కృషి చేస్తామని శ్వేత తెలిపారు.

### నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.ఎస్.మగ్బూల్ అహమ్మద్

**కదిరి టౌన్:** పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కదిరి వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.ఎస్.మగ్బూల్ అహమ్మద్ శనివారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు బి.ఎస్ మగ్బూల్ అహమ్మద్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వాములకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాదాపీర్, పాలకొండ నాయుడు, నాగేంద్ర, రఫీక్, అబు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

### కార్తీక వనభోజనాలకు తరలిరండి


వనభోజన మహోత్సవానికి ఆహ్వానిస్తున్న బలిజ సంఘం నాయకులు

**బత్తలపల్లి:** అనంతపురం సమీపంలోని తడకలేరు అశ్వర్థ నారాయణస్వామి వనం (సోమలదొడ్డి)లో ఆదివారం బలిజ కులస్తుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం ఉంటుందని రాయలసీమ బలిజ సంఘం నాయకులు తెలిపారు. శనివారం బత్తలపల్లి మండలానికి చెందిన బలిజ సంఘం నాయకులు బత్తలపల్లి, అప్పరాచెరువు, జ్వాలాపురం తదితర గ్రామాల్లోని బలిజ కులస్తుల ఇంటింటికీ వెళ్లి వనభోజనాలకు ఆహ్వానించారు. సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బలిజ కులస్తులు తమ విద్యా, వ్యాపారం, ఉద్యోగం మొదలగు రంగాల్లో అభివృద్ధికి తోడ్పాటు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు.

### బిల్లు తప్పనిసరిగా తీసుకోండి


మాట్లాడుతున్న రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్

**ధర్మవరం రూరల్:** వినియోగదారులు ఏదైనా వస్తువు కొన్నప్పుడు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. అప్పుడే ఏదైనా మోసం జరిగినప్పుడు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రావులచెరువు జెడ్పీహెచ్‌ఎస్‌లో సత్యసాయి కన్స్యూమర్ అవేర్నెస్ సొసైటీ, ధర్మవరం వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు నిత్యం మోసపోతున్నారని తెలిపారు. ఇందుకు ప్రధాన కారణం వినియోగదారులకు చట్టాలపై అవగాహన లేకపోవడమేనన్నారు. వినియోగదారులు ప్రతి ఒక్కరూ చట్టాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ బాబు, సభ్యులు నారాయణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాడు-నేడు.. ఆస్పత్రులు చూడు

- రూ.57.11 లక్షలతో ఎనుములపల్లి పీహెచ్‌సీ,హోమియోపతి ఆస్పత్రుల అభివృద్ధి
- ఆధునిక వసతుల కల్పన
- పెరిగిన రోగుల సంఖ్య


చూడముచ్చటగా రూపుదిద్దుకున్న ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


అన్ని హంగులతో నిర్మించిన ప్రభుత్వ హోమియోపతి వైద్య శాల

**పుట్టపర్తి అర్బన్:** గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ ఆస్పత్రులు నిరాధరణకు గురయ్యాయి. అనారోగ్యంతో రోగులు ఆస్పత్రులకు వస్తే డాక్టర్లు ఉండేవారు కాదు. మందులు, ఇతర మౌలిక వసుతులు కల్పించక పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. అయితే సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఒక్కసారిగా ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ పట్టుకుంది. నిరాధరణకు గురైన పుట్టపర్తిలోని ఆసుపత్రులను నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ఆయుష్షు పోసి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. పుట్టపర్తిలోని 6 పడకల ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లాలో ఉన్న ఏకైక ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలను రెండో విడత నాడు-నేడు పథకంలో ఎంపిక చేశారు. భవనాలను అన్ని హంగులతో తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పించారు.

**జిల్లాలో ఏకైక హోమియోపతి వైద్యశాల**

జిల్లాలో ఏకై క హోమియోపతి వైద్యశాల పుట్టపర్తిలోని సత్యమ్మ ఆలయం వద్ద ఉంది. గతంలో వాటర్ ట్యాంకు కింది భాగంలో నిర్వహిస్తుండేవారు. డాక్టర్ కూర్చొనేందుకు ఇబ్బంది పడిన సందర్భాలు ఉండేవి. సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సమీపంలోనే కొంత స్థలాన్ని ఇచ్చి రెండు గదులు నిర్మించి ప్రోత్సహించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ హోమియో వైద్యాధికారి డాక్టర్ క్రిష్ణయ్య సూచనల మేరకు ప్రభుత్వం నాడు-నేడు పథకంలో మౌలిక వసతులు కల్పించింది. సీలింగ్, హెర్బల్ గార్డెన్, మందులు, రికార్డులు నిల్వ చేయడానికి ర్యాక్‌లు, తగినన్ని మందులు, రోగులు కూర్చొనేందుకు అవసరమైన కుర్చీలు, ల్యాప్‌టాప్, వాటర్‌ఫిల్టర్, రంగులు వేయించి వసతులు కల్పించారు. గతంలో సగటున 60 మంది రోగులు ఈ ఆస్పత్రికి వచ్చేవారు. ప్రస్తుతం కదిరి, కొత్తచెరువు, ధర్మవరం, గోరంట్ల, పెనుకొండ తదితర ప్రాంతాల నుంచి సగటున 120 మంది వైద్య సేవలు పొందుతున్నారు.

**అత్యాధునికంగా 6 పడకల ఆసుపత్రి**

దాదాపు శిథిలావస్థకు చేరుకున్న ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం నాడు-నేడు పథకాన్ని తీసుకొచ్చి ఆసుపత్రిని అందంగా తీర్చి దిద్దారు. దీని కోసం ప్రభుత్వం రూ.54.61 లక్షలు వెచ్చించింది. నూతన పడకలు, రూఫ్ సీలింగ్, సిమెంటు రోడ్డు, ఫ్లోర్ టైల్స్, వైద్య పరికరాలు, ఫ్రిజ్‌లు, భవనానికి అందమైన రంగులు వేసి మౌలిక వసతులు కల్పించారు. నిత్యం రోగులకు అందుబాటులో ఉండేలా ఇద్దరు డాక్టర్లు నియమించడంతో రోగుల సంఖ్య బాగా పెరిగింది. ప్రస్తుతం రోజూ 150 నుంచి 200 మంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన అన్ని మందులు అందుబాటులోకి తీసుకురావడంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుక్క, పాము కాటుకు సైతం సకాలంలో వైద్యం అందిస్తున్నారు.

**వసతులు మెరుగయ్యాయి**



ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతం కంటే వసతులు మెరుగయ్యాయి. ప్రస్తుతం రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యం అందుతోంది. ఆసుపత్రికి ఇద్దరు డాక్టర్లను నియమించడం సంతోషంగా ఉంది. వైద్యులు రద్దీకి తగినట్లుగా వైద్య సేవలు అందిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా డాక్టర్‌ను నియమించడం జరిగింది. – గోపాల్‌రెడ్డి, ఎనుములపల్లి

**మారిన ఆస్పత్రి రూపురేఖలు**



జిల్లాలో ఉన్న ఏకైక హోమియోపతి ఆసుపత్రికి ఇటీవల ప్రభుత్వం రూ.2.5 లక్షలు ఖర్చు చేసి వసతులు కల్పించింది. మందులు సకాలంలో అందజేయడంతో రోగుల సంఖ్య బాగా పెరిగింది. ఆవరణలో హెర్బల్ గార్డెన్ ఏర్పాటు చేయ డం సంతోషంగా ఉంది. సత్యసాయి బాబా ఆశీస్సులతో నూతన భవనం అన్ని అన్ని హంగులతో రూపుదిద్దుకుంది.
– డాక్టర్ క్రిష్ణయ్య, సీనియర్ హోమియో వైద్యాధికారి, పుట్టపర్తి

## రహదారుల నిర్మాణాల్లో వేగం పెంచాలి


చిత్రావతి నదిపై ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**బత్తలపల్లి:** బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకూ చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిత్రావతి నదిపై నిర్మిస్తున్న ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా చిత్రావతి నది ప్రవాహంపై చర్చించారు. నదిలో నీరు ముందుకు సాగకుండా నీరు నిల్వ ఉండేందుకు రోడ్డు తీసేసిన తర్వాత వచ్చిన తారుతో అడ్డుగా వేయాలని సూచించారు. తద్వారా నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం అప్పరా చెరువులో నీటి నిల్వపై మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. చెరువులో చేపల కోసం మత్స్యకారుల కోరిక మేరకు నీరు వదిలినట్లు వివరించారు. నీరు నిల్వ ఉంచుకునేందుకు ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం సంఘమేశ్వర క్షేత్రంలో ఆర్డీటీ సహకారంతో నిర్మించిన రోడ్డు కమ్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. రెండు, మూడు రోజుల్లో వర్షాలు ఉన్నందున వెంటనే నీరు విడుదల చేయాలని ఆదేశించారు. కోడేకండ్లకు చెందిన నాయకుడు బండి వీరనారప్ప గేటు ఎత్తి ఉప్పర్లపల్లి చెరువుకు నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, బండి వీరనారప్ప, బండి నాగభూషణ, నాగన్న, రవీంద్రారెడ్డి, ముసలప్ప, లింగమయ్య పాల్గొన్నారు.

**పరామర్శ..**

**ముదిగుబ్బ:** మండల కేంద్రంలోని పాతూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మల్లాగుండ్ల శ్రీనివాసులను శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల రాళ్ల అనంతపురం వద్ద జరిగిన ఘర్షణలో గాయపడిన శ్రీనివాసులు చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కార్యకర్త ఇంటి వద్దకు వచ్చి పరామర్శించారు. ఘర్షణకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, మండల కన్వీనర్ సీవీ నారాయణ రెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ భాస్కర్, సింగిల్ విండో అధ్యక్షుడు బయపరెడ్డి, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

### వైకుంఠ ఏకాదశి వైభవంగా నిర్వహిస్తాం


మాట్లాడుతున్న దాశెట్టి సుబ్రహ్మణ్యం

**ధర్మవరం అర్బన్:** వైకుంఠ ఏకాదశి వైభవంగా నిర్వహిస్తామని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఆలయ ఈఓ వెంకటేశులు తెలిపారు. శనివారం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. నిరవధికంగా భక్తులకు దైవ దర్శనం కల్పిస్తామన్నారు. ఆలయ మేనేజర్ రామశాస్త్రి, అర్చకులు భాను ప్రకాష్, కోనేరాచార్యులు, మకరందబాబు, పుల్లయ్య, జగ్గా భరణి, కృష్ణ, రంగనాథ్, శ్రీధర్, సత్రసాల అశ్వర్థనారాయణ ఉన్నారు.

## ఇస్తెమా నిర్వహణకు సహకరిస్తాం


మైనార్టీలతో కలిసి ఇస్తెమా జరిగే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

**గాండ్లపెంట:** మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ సమీపంలో వచ్చే ఏడాది జనవరి 2, 3 తేదీల్లో ధర్మవరం, కదిరి తాలుకాలకు సంబంధించి ఇస్తెమా జరగనుంది. శనివారం మైనార్టీలతో కలిసి ఇస్తెమా జరిగే స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పరిశీలించారు. ఇస్తెమా నిర్వహణకు సహకారం అందించాలని ఇటీవల మైనార్టీ సోదరులు కోరడంతో సానుకూలంగా స్పందించారు. ఇస్తెమా నిర్వహణకు సహకారం అందిస్తామన్నారు. ఇస్తెమాకు దాదాపు 60 వేల నుంచి లక్ష మంది వరకూ రావొచ్చని అంచనా వేశారు. మంచినీరు, విద్యుత్ సౌకర్యం, పారిశుధ్యం, ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, రెవెన్యూ శాఖ, ఆర్టీసీ రవాణా సౌకర్యంపై చర్చించారు. వెంటనే ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో మాట్లాడిన ఎమ్మెల్యే.. ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను జామీయా, మదీనా మసీదు, ఇమాంలు ముతవల్లీలు, జమాత్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కదిరి, గాండ్లపెంట మైనార్టీ నాయకులు, జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

## తోపుదుర్తి ట్రస్టు సహకారంతో రైతులకు బోర్లు


ముక్తాపురంలో బోర్ల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కనగానపల్లి:** మండలంలోని ముక్తాపురంలో తోపుదుర్తి ట్రస్టు సహకారంతో రైతులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఉచితంగా బోర్లు వేయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన ఉచిత బోర్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతు కిష్టయ్య పొలంలో వేసిన బోరుబావిలో నీరు పుష్కలంగా పడటంపై వారు హర్షం వ్యక్తం చేశారు. తోపుదుర్తి ట్రస్టు ద్వారా మండలంలో ఇప్పటి వరకు సుమారు 200 బోర్లు వేయించామని, వాటిలో చాలా వరకు రైతులకు పుష్కలంగా నీరు పడిందని నాయకులు తెలిపారు. వైఎస్సార్ జలకళ కింద అర్హత పొంది ప్రభుత్వం ద్వారా ఇంకా బోర్లు వేయించుకోని రైతులకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి, బోర్లు వేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, సర్పంచ్ నారాయణ, ఓబిలేసు, వెంకటరాముడు, రైతులు పాల్గొన్నారు.

### రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామకృష్ణా రెడ్డి మృతి


రామకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి


రామకృష్ణారెడ్డి (ఫైల్)

**కదిరి అర్బన్:** కదిరి ప్రాంత విద్యార్థులకు దిశానిర్దేశం చేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.రామకృష్ణా రెడ్డి (84) ఇక లేరు. శనివారం ఉదయం జడ్జి క్వాటర్స్ వెనుక ఉన్న ఆయన నివాసంలో మృతి చెందారు. ఈయన స్థానిక ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేశారు. పి.రామకృష్ణా రెడ్డి స్వగ్రామమైన ఓడీసీ మండలం రామిరెడ్డిపల్లిలో ఆదివారం అంత్యక్రియలు జరగనున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డితో పాటు పలువురు రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### వైఎస్సార్‌సీపీని విమర్శిస్తే ఊరుకోం

**పుట్టపర్తి టౌన్:** గతంలో టీడీపీ వడ్డెర్లకు చేసింది శూన్యం. వైఎస్సార్‌సీపీని విమర్శించే స్థాయి టీడీపీ వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డే వెంకట్, కార్పొరేషన్ చైర్మన్ దేవర్ల మురళీకి లేదని జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మారెప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేవర్ల మురళీ అడుడగుగునా వడ్డెర్లను మోసం చేశారన్నారు. కొన్ని నెలలుగా రాజకీయ లబ్ధి, స్వప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీని విమర్శిస్తున్నారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మళ్లీ వడ్డెర ఓట్లను దండుకునేందుకు వడ్డె వెంకట్, మురళీ వస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి వారిని నమ్మొద్దని వడ్డెర కులస్తులకు సూచించారు. కొంత మంది వడ్డెర్లను మాత్రమే తీసుకొని వెళ్లి అనంతపురం జిల్లాలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. టీడీపీ ఐక్యతా సమావేశంలో వడ్డెర్లను విమర్శిస్తే ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. వడ్డెర్లకు నామినేటెడ్, సర్పంచ్, తదితర పదువులను కేటాయించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని పేర్కొన్నారు.

### ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

**ముదిగుబ్బ:** మండల పరిధిలోని ఉస్సేనపురం గ్రామంలో శనివారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పండితులు భూపతి శివకుమార్, సుధీనాథ్ శర్మ, హేమంత్‌కుమార్, వంశీకృష్ణా, రాధాకృష్ణ తదితరులు స్వామి ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. యంత్ర ప్రతిష్ట, బింబ ప్రతిష్ట, అభిషేకం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు యోగానంద రెడ్డి, పరందామరెడ్డి, నారాయణ స్వామి, శివయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రాయుడు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం


ధర్మవరం మండలం నాగలూరులో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న దృశ్యం

**అమడగూరు:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు అమలవుతాయని సీఈసీ సభ్యుడు డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి, సంగీతంపల్లి, తిమిరికుంటపల్లి, వడ్డిపల్లి, నిలువురాతిపల్లి, బావిచెర్లోపల్లి, కొట్టువారిపల్లి, సానేవారిపల్లి, బాలప్పగారిపల్లి, గువ్వలపల్లి, ఎర్రగుండువారిపల్లి గ్రామాలలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ధర్మవరం రూరల్:** మండల పరిధిలోని నాగలూరు గ్రామంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ సర్పంచ్ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజల మద్దతు కోరారు. అనంతరం వై ఏపీ నీడ్స్‌కు సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు.

## సంక్షిప్త సమాచారం

**బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత**


పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాజేష్

**కొత్తచెరువు:** మండలంలోని తలమర్ల గ్రామానికి చెందిన చింతమాను నరసింహులు ఉరఫ్‌సాయిరాం, దాదులూరు చిన్న నరసింహులు అనారోగ్యంతో బెంగుళూరులోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ రాజేష్, డీలర్ రామాంజనేయులు శనివారం బెంగళూరుకు వెళ్లారు. ఆసుపత్రిలోనే కుటుంబ సభ్యులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

**ఎండీయూ వాహనం ప్రారంభం**

**కదిరి అర్బన్:** మండల పరిధిలోని పట్నం పంచాయతీలో ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే ఎండీయూ వాహనాన్ని శనివారం వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మెంబర్ సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. కొన్ని అనివార్య కారణాలతో వాహనం కొంత కాలంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. ఎండీయూ వాహనాన్ని ప్రారంభించడంతో లబ్ధిదారులకు నిత్యావసరాలు సకాలంలో అందుతాయి.

**కర్ణాటక మద్యం స్వాధీనం**

**తనకల్లు:** కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న 122 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ శనివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వెంకటరమణను మండల కేంద్రానికి సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్‌ఐ తెలిపారు.

**5న కుల గణనపై సమీక్ష**

**కనగానపల్లి:** ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమంపై ఈ నెల 5న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కుల సంఘాల నాయకులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు హాజరుకావాలన్నారు.

**వ్యక్తికి తీవ్ర గాయాలు**

**ధర్మవరం రూరల్:** మండల పరిధిలోని రేగాటిపల్లికి చెందిన రామ్మోహన్‌రెడ్డి శనివారం ధర్మవరం నుంచి స్వగ్రామానికి వెళ్తూ మార్గంమధ్యలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ఈ ఘటనలో అతడి తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్సల నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సల కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

**భక్తులతో ఖాద్రీ కిటకిట**



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

**కదిరి టౌన్:** కార్తీక మాసం సందర్భంగా శనివారం ఖాద్రీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం నుంచి తరలిచ్చిన భక్తులు ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**భక్తిశ్రద్ధలతో పడిపూజ**

**తాడిమర్రి:** కార్తీక శనివారం పురస్కరించుకుని స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పమాలధారులు భక్తిశ్రద్ధలతో పడిపూజ చేశారు. సత్యనారాయణ స్వామి, నారాయణ స్వామి తదితర గురుస్వాముల ఆధ్వర్యంలో తొలుత అయ్యప్ప మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు రామాంజనేయులు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఓటుహక్కు కల్పిస్తాం


ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

**ధర్మవరం అర్బన్:** అర్హులందరికీ ఓటుహక్కు కల్పించేందుకు బీఎల్‌ఓలు కృషి చేయాలని ఆర్డీఓ రమేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను భర్తీ చేసే విషయంలో అశ్రద్ధ వహించకుండా కచ్చితమైన సమాచారాన్ని పొందుపరచాలని ఆదేశించారు.

**కదిరి అర్బన్:** మండలంలోని ఓటరు నమెదు కేంద్రాలను ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ పరిశీలించారు. ఫారం 6కు 324, ఫారం-7కు 281, ఫారం-8కు 119 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 180 ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు.

**ఎన్పీకుంట:** మండలంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ నరేంద్రకుమార్ పరిశీలించారు. 30 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో 17 మంది కొత్త ఓటుకు నమోదు చేసుకున్నారు. అలాగే 7 మంది మరణించడంతో ఓట్ల తొలగింపుకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

**కొత్తచెరువు:** మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి సందర్శించారు. పోలింగ్ కేంద్రాలు ప్రజలకు దగ్గరగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీటీ స్వామి సూచించారు.

**నల్లమాడ:** మండలంలోని 39 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక ఓటరు కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, డిప్యూటీ తహసీల్దార్ (రీ సర్వే) మల్లికార్జున ప్రత్యేక ఓటరు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఓటరు నమోదుకు (ఫారం-6) 99, తొలగింపులకు సంబంధించి (ఫారం-7) 20, సవరణలకు గాను 14 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

**రామగిరి:** మండలంలోని పేరూరు, పేరూరుడ్యాం, నసనకోట, కొత్తగ్యాదికుంట, కుంటిమద్ది, గంతిమర్రి గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ నారాయణస్వామి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ జైప్రకాష్, వీఆర్‌ఓలు జగదీష్, నల్లప్ప, మంజునాథ్, ముత్యాలప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

### ఘనంగా ఉరుసే షరీఫ్


వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**ధర్మవరం:** పట్టణంలోని చెరువుకట్ట సమీపంలోని ఖాద్రి రోజా ఏ ముబారక్ హజరత్ సయ్యద్ మహమ్మద్ షా ఖాదర్‌వలి 97వ ఉరుసే షరీఫ్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శనివారం రాత్రి జరిగిన ఉరుసులో ఖవ్వాలి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉరుసు ఉత్సవాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పాల్గొని, వస్త్రాలు సమర్పించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సన్మానించారు.